'కేశోరాం'లో బీఆర్ఎస్ ప్యానల్ విజయం

- కాంగ్రెస్ కంచుకోటలో ఏడేండ్ల తర్వాత గులాబీ గుబాళింపు
- ప్రధాన కార్యదర్శిగా మాదాసు శ్రీనివాస్ 66 ఓట్లతో గెలుపు

విజయోత్సవ ర్యాలీలో అధ్యక్షుడు కౌశికహరి, ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్

పాలకుర్తి, జూన్18: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారం కాంట్రాక్టు కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటింది. కాంగ్రెస్ కంచుకోటలో ఏడేండ్ల తర్వాత గులాబీ గుబాళించింది. బీఆర్ఎస్ నేత, కేశోరాం గుర్తింపు సంఘం అధ్యక్షుడు కౌశికహరి, ప్యానల్ ప్రధానకార్యదర్శి అభ్యర్థి మాదాసు శ్రీనివాస్ ఘన విజయం సాధించారు. కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికలను యాజమాన్యం మంగళవారం నిర్వహించింది. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 809 మంది ఓటర్లకుగాను 787 మంది ఓటు వేశారు. ఇందులో బీఆర్ఎస్ నేత కౌశికహరి, ప్యానల్ అభ్యర్థి మాదాసు శ్రీనివాస్ గెలుపొందారు. శ్రీనివాస్‌కు 418 ఓట్లు రాగా, కాంగ్రెస్ నేత బయ్యపు మనోహర్‌రెడ్డి ప్యానల్ అభ్యర్థి నగునూరి రమేశ్‌కు 352 ఓట్లు వచ్చాయి. నగునూరి రమేశ్‌పై మాదాసు శ్రీనివాస్ 66 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్టు ఎన్నికల అధికారి బీ డానియల్ ప్రకటించారు. హోరాహోరీగా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడంతో కేశోరాం కార్మికులు, నాయకులు సంబురాలు జరుపుకున్నారు.

ఈ విజయం కేసీఆర్‌కు అంకితం

కేశోరాం గుర్తింపు సంఘం ఎన్నికల్లో మా ప్యానల్ విజయం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అంకితం. ఎన్నికల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు కార్మికులపై అనేక రకాలుగా ఒత్తిడి చేసినా కార్మికులు నిజాయితీగా ఓటుహక్కు వినియోగించుకుని బీఆర్ఎస్ ప్యానల్‌ను గెలిపించడం సంతోషంగా ఉంది. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా వెనక్కి తగ్గకుండా కార్మికులు మాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా, హక్కుల సాధన కోసం పోరాటం చేస్తాం.

-కౌశికహరి, కేశోరాం గుర్తింపు సంఘం అధ్యక్షుడు

ఇన్ఫినిటీ, హస్తినకు రెరా నోటీసులు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) నిబంధనలు ఉల్లంఘించడంపై సొనెస్టా ఇన్ఫినిటీ, హస్తిన రియల్టీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు రెరా అధికారులు తెలిపారు. సొనెస్టా ఇన్ఫినిటీ ప్రమోటర్స్ గచ్చిబౌలి కేర్ హాస్పిటల్ వెనక ఉన్న జయభేరి పైన్ కాలనీలో స్కై విల్లాస్ నిర్మాణాలకు రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా సోషల్ మీడియా ద్వారా బ్రోచర్ విడుదల చేసి ప్రచారం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. హస్తిన రియల్టీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్స్ ట్రిస్సా ప్రాజెక్టు పేరుతో శ్రీశైలం హైవే సమీపంలో కడ్తాల్ టౌన్ ఫార్మా సిటీ వద్ద రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారాలు నిర్వహించడంతో షోకాజ్ నోటీసులు జారీచేసి వారంలోగా సంజాయిషీ ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించినట్టు వెల్లడించారు. రెరా రిజిస్టర్డ్ ప్రాజెక్టుల్లో మాత్రమే ఇండ్లు, ఫ్లాట్లు కొనుగోలు చేయాలని, ప్రీలాంచ్ ఆఫర్లు అంటూ మోసపూరిత ప్రకటనలు నమ్మి మోసపోవద్దని కోరారు. రెరా నిబంధనలు ఉల్లంఘించిన రియల్టర్స్, భవన నిర్మాణదారులపై వాట్సాప్ నంబర్ 90000 06301, ఫోన్ 040-2939 4972లతో పాటు rera-maud@ telangana.gov.in, secy-rera-maud@telangana.gov.in e- mail ID లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రైతుల కోసం మరో 8 రకాల వంగడాలు

వ్యవసాయ వర్సిటీ విడుదల

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 18: వ్యవసాయ రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం తాజాగా మరో 8 రకాల నాణ్యమైన వరి, మక్కజొన్న, రాగి, సజ్జ, జొన్న వంగడాలను విడుదల చేసింది. సెంట్రల్ వెరైటల్ రిలీజ్ కమిటీ, రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీ ఆమోదంతో మంగళవారం వీటిని విడుదల చేసినట్టు వర్సిటీ వీసీ డాక్టర్ ఎం రఘునందన్‌రావు చెప్పారు. వీటిలో తెగుళ్లను నిరోధించగలిగే ఆర్ఎన్ఆర్ (రాజేంద్రనగర్) 28361, కేఎన్ఎం 7037, డబ్ల్యూజీఎల్ 1289, ఉల్లికోడును తట్టుకోగలిగే వరంగల్ 119 వరి వంగడాలతోపాటు మక్కజొన్నలో హైబ్రిడ్ డీహెచ్ఎం 206, జొన్నలో మాల్దండి రకానికి దీటుగా తాండూర్ పరిశోధనా స్థానం తయారు చేసిన ఎస్‌వీటీ 55, సజ్జలో హైబ్రిడ్ పీబీహెచ్ 1625, కాల్షియం అధికంగా ఉండే పీఆర్ఎస్ 38 రాగి వంగడాలు ఉన్నట్టు వివరించారు. ఇప్పటిదాకా 61 కొత్త వంగడాలను విడుదల చేశామన్నారు.

నకిలీ విత్తనాల విక్రేతలపై చర్యలు

మొలకెత్తని విత్తనాలపై స్పందించిన ఏవో

ఐనవోలు, జూన్ 18: నకిలీ విత్తనాల విక్రేతలపై చర్యలు తప్పవని హనుమకొండ జిల్లా ఐనవోలు ఏవో కవిత హెచ్చరించారు. ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లికి చెందిన రైతు బండారి శ్రీను వెంకటాపురం శివారులో 1.20 ఎకరాల భూమిని కౌలు తీసుకొని ఓ కంపెనీకి చెందిన మక్కజొన్న విత్తనాలను మండల కేంద్రంలోని ఓ డీలర్ వద్ద కొనుగోలు చేశాడు. వాటిని విత్తగా 90 శాతం మొలకెత్తలేదు. దీంతో తనకు రూ. 25 వేల వరకు నష్టం వాటిల్లిందని సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేయగా వైరల్ అయింది. ఇదే విషయాన్ని ఈ నెల 16న 'మొలకెత్తని మక్కజొన్న విత్తనాలు' శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఏవో కవిత స్పందించారు. మంగళవారం ఆమె బండారి శ్రీను పొలాన్ని పరిశీలించారు. రిపోర్టు ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వృద్ధుడి భూమిని కొట్టేసిన పెద్దపల్లి ఏసీపీ!

- డబ్బులివ్వకుండానే భార్య పేరుమీద రిజిస్ట్రేషన్
- పురుగుల మందుతో వృద్ధుడి ధర్నా
- పోలీసులు, ఎమ్మెల్యేకు చెప్పినా ఫలితం లేదని ఆవేదన

టేకుమట్ల మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న వృద్ధుడు, బంధువులు

టేకుమట్ల, జూన్ 18: 'పెద్దపల్లి ఏసీపీ నా భూమిని కొనుగోలు చేసి సగం డబ్బులు ఇచ్చాడు. మిగతా డబ్బులు రిజిస్ట్రేషన్ అయ్యాక ఇస్తానని నమ్మబలికి.. నా భూమిని ఆయన భార్య పేరుమీదకు బదలాయించుకున్నాడు. రిజిస్ట్రేషన్ అయ్యాక మిగతా డబ్బులు ఇవ్వాలని అడిగితే ముప్పుతిప్పలు పెడుతున్నాడు' అని ఓ వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులు, ఎమ్మెల్యేకు చెప్పినా న్యాయం చేయడం లేదంటూ పురుగుల మందు డబ్బా పట్టుకొని బంధువులతో కలిసి మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో ధర్నాకు దిగాడు. రైతులు, స్థానిక ప్రజలు ఆ వృద్ధుడికి మద్దతుగా నిలిచారు. మండలంలోని ఆరెపల్లికి చెందిన ఇటుకాల రాయమల్లుకు సర్వే నెంబర్ 63/అ/1-62/ఇ/1లో 39 గుంటల భూమి ఉంది. దవాఖానలో తన ఆరోగ్యం బాగుచేయించుకోవాలని ఆ భూమిని అమ్మకానికి పెట్టాడు. అదే గ్రామానికి చెందిన (పెద్దపల్లిలో ఏసీపీ) గజ్జి కృష్ణ (ప్రస్తుతం హనుమకొండలో నివాసం ఉంటున్నారు) తన భార్య రాధికారాణి పేరిట రూ.13.65 లక్షలకు కొనుగోలు చేశాడు. ఒప్పందం ప్రకారం మొదట రూ.7 లక్షలు చెల్లించి, రిజిస్ట్రేషన్ సమయంలో రూ.6.65 లక్షలు ఇవ్వాల్సి ఉన్నది. రిజిస్ట్రేషన్ రోజున గ్రామస్థుడు కుర్రె ప్రభాకర్ డబ్బులివ్వాలని అడుగగా.. 'యూజ్‌లెస్ ఫెలో.. నీకెలా కనపడుతున్నాను' అంటూ ఏసీపీ బూతులు తిట్టి ఇంటి కెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లి అడుగగా.. భూమిలో ఉన్న బోరును రిపేర్ చేస్తేనే మిగతా డబ్బులు ఇస్తానని మెలికపెట్టాడు. ఆ విషయమై తాను కాగితం రాసుకోలేదని, తన డబ్బులు ఇవ్వాలని కోరాడు. పెద్ద మనుషులతో ఒత్తిడి చేయగా.. 'ఇంటికి ఎందుకు వస్తున్నారు? భూమి మా పేరు మీదకు వచ్చింది. ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి' అంటూ బెదిరించాడని గ్రామ పెద్ద మనిషి బాషబోయిన రాజయ్య పేర్కొన్నాడు. ఇదే విషయమై బాధితుడు టేకుమట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు సీఐ, డీఎస్పీతోపాటు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసినా న్యాయం జరగలేదు. దీంతో చావే శరణ్యమనుకున్న వృద్ధుడు బంధువులతో కలిసి పురుగుల మందు డబ్బాతో టేకుమట్లలో ధర్నాకు దిగాడు. పోలీసులు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించాడు. ఈ విషయమై ఏసీపీ గజ్జి కృష్ణ భార్య రాధికారాణిని వివరణ అడుగగా.. మా ఎదుగుదలను చూసి ఓర్వలేని మా బంధువులే మమ్మల్ని బద్నాం చేస్తున్నరు' అని తెలిపారు.

ఆర్ఎస్సై నా భూమిని ఆక్రమించాడు

ములుగు ఎస్పీకి ఓ రైతు ఫిర్యాదు

ములుగు రూరల్, జూన్ 18 : పోలీస్ ఆర్ఎస్సై తన భూమిని ఆక్రమించాడని ములుగు మండలం దేవనగర్‌కు చెందిన బొమ్మరబోయిన కుమార్ అనే రైతు మంగళవారం ఎస్పీ డాక్టర్ పీ శబరీష్‌కు ఫిర్యాదు చేశాడు. దేవనగర్‌లో సర్వే నంబర్ 91/3లో వారసత్వంగా వచ్చిన ఆరు గుంటల భూమిని గడ్డి ప్రశాంత్ అనే ఆర్ఎస్సై ఆక్రమించినట్టు తెలిపాడు. ఈ నెల 10న ప్రశాంత్ పోలీసులతో వచ్చి తనను బెదిరించినట్టు పేర్కొన్నాడు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరాడు.

ఒకే టీచర్‌కు మూడు పదోన్నతులు!

- ఒకటే ఎంపిక.. మళ్లీ ఖాళీలు
- మళ్లీ కౌన్సెలింగ్‌కు డిమాండ్లు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): టీచర్ల పదోన్నతుల్లో వింతలు, విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఒకే టీచర్‌కు మూడు పదోన్నతులు దక్కాయి. ఆదిలాబాద్‌లో జిల్లాలో ఓ టీచర్‌కు ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా, స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్)గా, స్కూల్ అసిస్టెంట్ (సోషల్‌స్టడీస్)గా పదోన్నలు దక్కాయి. సదరు టీచర్‌కు అన్ని రకాల అర్హతలున్నాయి. ఆయన పెట్టుకున్న వెబ్‌ఆప్షన్లను బట్టి పదోన్నతులిచ్చారు. ఇలాంటివి చాలా జరిగి ఉంటాయని ఉపాధ్యాయ సంఘాలు చెప్తున్నాయి. సోమవారం రాత్రి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల జాబితా సిద్ధమైంది. అధికారుల పరిశీలనలో ఇదే విషయం తేలడంతో ఉత్తర్వులు వెలువడలేదు. టీచర్లు మూడు పదోన్నతులు పొంది ఒకే పోస్టును ఎంపికచేసుకొంటే మిగతా వారికి అన్యాయం జరుగుతుందని, ఖాళీల్లో మళ్లీ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని కోరుతున్నారు.

బదిలీల ప్రక్రియ కొనసాగిస్తాం: బుర్రా

టీచర్ల బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ యధాతథంగా కొనసాగుతుందని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మీడియాకు తెలిపారు. ప్రస్తుత షెడ్యూల్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఎస్జీటీలకు పదోన్నతి కల్పించాలి

డీఎడ్, బీఎడ్ అర్హతలతో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియమితులైన టీచర్లకు సీనియార్టీ ప్రకారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాస్ సురేశ్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి కోరారు.

ఉపాధ్యాయుడి వివాహేతర సంబంధం

చెట్టుకు కట్టేసి స్థానికుల దేహశుద్ధి

ఉపాధ్యాయుడు రాందాస్‌ను చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

అశ్వారావుపేట, జూన్ 18: ఓ వివాహితతో వివాహేతర సంబంధం నెరపుతున్నాడనే నెపంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి మహిళ బంధువులు, గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నెమలిపేటలో చోటుచేసుకుంది. గ్రామంలోని ఐటీడీఏ పాఠశాలలో ఉపాధ్యాయుడి లవుడ్యా రాం దాస్.. స్థానిక ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు ఆరోపణలున్నాయి. మంగళవారం రాందాస్‌తోపాటు వివాహితను గ్రామస్థులు లాక్కొచ్చి చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో పీ కృష్ణయ్య, సీఐ జితేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని రాందాస్‌ను విడిపించి పోలీస్‌సేషన్‌కు తరలించారు.

క్యాన్సర్ కణాల వృద్ధిపై సీడీఎఫ్‌డీ అధ్యయనం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): మానవాళి మనుగడకు పెనుసవాలుగా మారిన క్యాన్సర్ మహమ్మారిపై సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) ప్రత్యేకంగా దృష్టి సారించింది. క్యాన్సర్ కణాలు ఏవిధంగా వృద్ధి చెందుతాయో తెలుసుకునేందుకు లోతుగా అధ్యయనం చేస్తున్నది. ఇందుకోసం జెనెటిక్స్, మాలిక్యులార్ జెనెటిక్స్, మాలిక్యులార్ పాథాలజీ, సెల్ బయాలజీకి సంబంధించిన అత్యాధునిక సాధనాలను ఉపయోగిస్తున్నది. ప్రస్తుతం కొలొరెక్టల్ క్యాన్సర్ ఉపరకం వ్యాధుల లక్షణాలను తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనల్లో సీడీఎఫ్‌డీ భాగస్వామిగా ఉన్నది.

రూ.కోటి విలువైన ఆల్ప్రాజోలం సీజ్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ఆల్ప్రాజోలం మత్తు పదార్థం తయారీ కేంద్రంపై పోలీసులు దాడులు జరిపారు. రూ. కోటి విలువైన 2.6 కిలోల ఆల్ప్రాజోలం, ముడిపదార్థాలు, యంత్రాలను సీజ్ చేశారు. గుమ్మడిదల ఠాణా పరిధిలోని కొత్తపల్లి శివారులో నిషేధిత ఆల్ప్రాజోలంను తయారు చేస్తున్నట్టు సమాచారం అందిందని నార్కోటిక్ బ్యూరో డీజీ సందీప్ శాండిల్య చెప్పారు. స్థానిక పోలీసులతో కలిసి దాడులు చేపట్టి కోటి విలువైన ఆల్ప్రాజోలంను సీజ్ చేశామని వెల్లడించారు. ఈ మత్తు పదార్థాన్ని ఎక్కువగా కల్తీ కల్లులో ఉపయోగిస్తుంటారని తెలిపారు. గోసుకొండ అంజిరెడ్డి, క్యాసారం రాకేశ్‌ను అరెస్టు చేశామని, మరో నిందితుడు ప్రభాకర్ గౌడ్ పరారీలో ఉన్నాడని డీజీ పేర్కొన్నారు.

- గుట్టలో కోలాహలంగా గిరిప్రదక్షిణ

యాదగిరిగుట్టలో నరసింహస్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు కొండకింద గాలిగోపురం వద్ద పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణ చేపట్టారు. స్థానికులతోపాటు భక్తులు సుమారు 5 వేల మంది పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు ఉచిత దర్శనం కల్పించారు. ఈ వేడుకలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. – యాదగిరిగుట్ట

గద్వాల దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్

14 మందికి నోటీసులు.. ఫార్మసిస్ట్ సస్పెన్షన్

గద్వాల, జూన్ 18 : జోగుళాంబ గద్వాల జిల్లా దవాఖానను మంగళవారం కలెక్టర్ సంతోష్ ఆకస్మిక తనిఖీ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు 14 మందితోపాటు మరో నలుగురు వైద్య సిబ్బంది విధులకు గైర్హాజరవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు సక్రమంగా రాని 14 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. స్టోర్‌లో స్టాక్ వివరాలు, రిజిస్టర్లు సక్రమంగా లేకపోవడంతో ఫార్మసిస్ట్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

కలెక్టర్ క్రాంతి అవినీతిపై విచారణ చేపట్టాలి

గద్వాల కలెక్టర్‌కు కాంగ్రెస్ వినతి

గద్వాల, జూన్ 18 : జోగుళాంబ గద్వాల కలెక్టర్‌గా గతంలో పనిచేసిన వల్లూరు క్రాంతి అవినీతిపై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పీసీసీ అధికార ప్రతినిధి షెక్షావలి ఆచారి, ఆర్డీఎస్ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డితోపాటు పలువురు కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల కలెక్టర్‌గా పనిచేసిన క్రాంతి జిల్లాలో పలు భూ రికార్డులు మార్చి ఎన్నో అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపించారు. విచారణ చేపడితే ఆమె అవినీతి, అక్రమాలు బయటపడే అవకాశం ఉన్నదని వారు సూచించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు మద్దిలేటి, ఇసాక్, గణేశ్, వెంకటేశ్, ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్‌లో స్కూల్ వర్క్స్ బిల్లులు

మోటర్, సామగ్రి తీసుకెళ్లేందుకు కాంట్రాక్టర్ యత్నం

చందూర్, జూన్ 18: సర్కారు బడిలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు నలిగిపోతున్నారు. దీంతో ఓ కాంట్రాక్టర్ తాను చేసిన పనులకు సంబంధించిన సామగ్రిని తీసుకెళ్లేందుకు యత్నించగా.. విద్యార్థులకు ఇబ్బందులు వస్తాయని స్థానిక ప్రజాప్రతినిధులు విన్నవించడంతో అలాగే వదిలివెళ్లాడు. నిజామాబాద్ జిల్లా చందూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కాంట్రాక్టర్ రాంచందర్ అభివృద్ధి పనులు చేశాడు. రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేసి మూత్రశాలలకు నీటి సౌకర్యం కల్పించడంతోపాటు నల్లా పైపులు, మోటర్ బిగింపు పనులు నిర్వహించాడు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురయ్యాడు. చేసేదిలేక మంగళవారం స్కూల్‌కు వెళ్లిన కాంట్రాక్టర్.. తాను బిగించిన మోటర్‌ను తొలగించాడు. ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు వచ్చి కాంట్రాక్టర్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఏడాదిన్నర గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోతే బతికేది ఎలా అని రాంచందర్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి తమ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశాడు.

చందూర్ ప్రభుత్వ పాఠశాలలో నీటి మోటర్‌ను తొలగిస్తున్నరాంచందర్

53 వేల మంది విద్యార్థులకు బూట్లు

- సర్కారు బడుల్లో చదివే వారికి ఉచితంగా అందజేస్తా
- జడ్చర్ల ఎమ్మెల్యే వెల్లడి

జడ్చర్ల, జూన్ 18 : జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తన సొంత ఖర్చుతో బూట్లు అందజేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తాను నియోజకవర్గంలో గతంలో పాదయాత్ర చేసిన సమయంలో పలువురు విద్యార్థులు చెప్పులు లేకుండా పాఠశాలలకు వెళ్తున్న విషయాన్ని గమనించినట్టు తెలిపారు. అప్పుడే పిల్లలకు షూస్ ఇప్పించాలని నిర్ణయించినట్టు చెప్పారు. నియోజకవర్గంలో 274 ప్రభుత్వ పాఠశాలల్లో 53 వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారని వివరించారు. వీరందరికి రెండు నెలల్లో బూట్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

ఫోన్ల ట్యాపింగ్‌పై లోతైన విచారణ

కోర్టు అనుమతికి పోలీసుల పిటిషన్

నాంపల్లి కోర్టులు, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో ఇటీవల చార్జిషీట్ దాఖలు చేసిన పంజాగుట్ట పోలీసులు.. ఈ వ్యవహారంలో నిందితులను మరింత లోతుగా విచారించేందుకు కోర్టు అనుమతి కోరారు. ఈ మేరకు మంగళవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిందితుల నుంచి మరింత సమాచారాన్ని రాబట్టాల్సి ఉన్నదని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, మరో నిందితుడైన ఓ మీడియా సంస్థ ప్రతినిధి ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారని, రెడ్‌కార్నర్ నోటీసులతో వారిని త్వరలో స్వదేశానికి రప్పించి అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దీంతో పోలీసుల పిటిషన్‌పై బుధవారం ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు కోర్టు ప్రకటించింది.

హైకోర్టులో విచారణ

ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలను ఆధారంగా చేసుకుని సుమోటోగా కేసు విచారణ జరుపుతున్న హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రింట్ మీడియా, టీవీలతోపాటు సోషల్ మీడియాలో వచ్చిన కథనాలతోపాటు రాజకీయ నాయకుల ప్రమేయానికి సంబంధించిన సమాచారాన్ని సమర్పించాలని అధికారులకు స్పష్టం చేసింది.

పట్టాలిచ్చే వరకు ఆందోళన విరమించం

- లేదంటే కేటాయించిన ఇండ్లల్లోకి ప్రవేశిస్తాం
- భూపాలపల్లిలో వంటావార్పుతో 'డబుల్ బెడ్రూం'లబ్ధిదారుల నిరసన

భూపాలపల్లి జిల్లా కేంద్రం భాస్కర్‌గడ్డలోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద వంటావార్పులో భాగంగా సహపంక్తి భోజనాలు చేస్తున్న లబ్ధిదారులు

కృష్ణకాలనీ, జూన్ 18 : తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు ప్రభుత్వం పట్టాలిచ్చేంత వరకు ఆందోళనలు విరమించేది లేదని లబ్ధిదారులు హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భాస్కర్‌గడ్డలో నిర్మించి కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు పట్టాల కోసం కొద్దిరోజులుగా నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆరో రోజైన మంగళవారం అక్కడే వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రమేశ్, కుమార్, తుకారాం తదితరులు మాట్లాడుతూ.. వారం రోజులుగా తాము చేస్తున్న ఆందోళనలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అక్టోబర్‌లో కలెక్టర్ పర్యవేక్షణలోనే ప్రభుత్వ అధికారులు మూడుసార్లు సర్వేచేసి, ఇండ్లులేని తమను గుర్తించి ఇండ్లు కేటాయించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలివ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే తమ గోడును పట్టించుకొని పట్టాలివ్వాలని కోరారు. లేదంటే కుటుంబ సభ్యులతో వచ్చి తమకు కేటాయించిన ఇండ్లల్లోకి ప్రవేశిస్తామని, అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు.


విద్యుత్తు స్తంభం చివరన కృష్ణయ్య

మద్యం మత్తులో విద్యుత్తు స్తంభంపైకి..

కరెంట్ సరఫరా నిలిపివేసి ప్రాణాలు కాపాడిన పోలీసులు

మరికల్, జూన్ 18 : మద్యం మత్తులో ఓ వ్యక్తి విద్యుత్తు స్తంభం ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. జిన్నారం గ్రామానికి చెందిన కృష్ణయ్య మరికల్‌లోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కరెంట్ స్తంభం ఎక్కాడు. గమనించిన పోలీసులు విద్యుత్తు అధికారులకు ఫోన్ చేసి సరఫరా నిలిపివేయించారు. అయినా అతడు కిందికి దిగి రాకుండా పిచ్చి చేష్టలు చేశాడు. కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే పెద్దచింతకుంటకు చెందిన యువకుడు శ్రీకాంత్ పోల్‌పైకి ఎక్కి అతడిని కిందికి దించాడు. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. వ్యక్తి ప్రాణాలు కాపాడిన శ్రీకాంత్‌ను సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్సై మురళి అభినందించారు.

సింగరేణిలో బయోమెట్రిక్ హాజరు

- విధులకు రాకుండా మస్టర్ పడితే వేటే
- డ్యూటీకి వచ్చి ఆఫీసు దాటినా ఉపేక్షించేది లేదు
- సీఎండీ బలరాం మరో కీలక నిర్ణయం

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థ ఉద్యోగులు, అధికారులంతా ఇకపై రోజూ తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని సీఎండీ ఎన్ బలరాం ఆదేశించారు. విధులకు రాకుండా మస్టర్ పడిన వారిపై వేటువేస్తామని, విధులకు హాజరైన తర్వాత బయటికెళ్తున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిఘా వర్గాల ద్వారా తమకు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, మధ్యాహ్న భోజనం తర్వాత చాలా మంది మూడు గంటల వరకు విరామం తీసుకుంటున్నట్టు తెలిసిందని పేర్కొన్నారు. బయోమెట్రిక్ హాజరుపై ఏరియాల వారీగా జీఎంలు, విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి దవాఖానలు, డిస్పెన్సరీల్లోని వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాకపోతే కఠిన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. బొగ్గు ఉత్పత్తిలో పాల్గొంటున్న కార్మికులు రోజుకు 8 గంటలు పనిచేస్తున్నారని, ఉద్యోగులు, అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని హితవు పలికారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో 32 మంది ఆలస్యంగా వచ్చారని, వారిని ఆయా విభాగాధిపతులు మందలించారని తెలిపారు. నిరంతరంగా సమయపాలను నమోదు చేయాలని, జీఎంలు కార్యాలయాలు, గనుల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని సీఎండీ ఆదేశించారు.

వరుణ దేవుడికి పూజలు

వానలు కురువాలని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో రైతులు పూజలు చేశారు. ఊళ్లోని బొడ్రాయికి, గ్రామ దేవుళ్లకు బిందెలతో నీళ్లు పోశారు. అలాగే సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం పాతర్లపహాడ్‌లో రైతులు, మహిళలు బిందెలతో నీళ్లు పోసి వరుణ దేవుడిని పూజించారు. –నార్కట్‌పల్లి/ఆత్మకూర్.ఎస్

బీరు తాగుతూ విధులు

మహబూబాబాద్ ఆర్టీవోలో ఉద్యోగి నిర్వాకం • ఉద్యోగం నుంచి తొలగింపు


ఆర్టీవో కార్యాలయంలో బీరు తాగుతూ పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సురేశ్

మహబూబాబాద్, జూన్ 18 : మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మంగళవారం బీరు తాగుతూ విధులు నిర్వర్తించాడు. మత్తులో తూలుతూ పనులు చేస్తుండటంతో లైసెన్స్ కోసం వెళ్లిన ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా అది వైరల్‌గా మారింది. ఈ విషయాన్ని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్‌కు సమాచారం అందించారు. సీరియస్‌గా పరిగణించిన అధికారులు ఉద్యోగి సురేశ్‌ను ఉద్యోగంలో నుంచి తొలగించారు. కాగా, మహబూబాబాద్ ఆర్టీఏ కార్యాలయం తరచూ రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తూ వస్తున్నది. ఇటీవలే ఏసీబీ అధికారులు తనిఖీ చేయగా, ఆరుగురు ఏజెంట్లు, ఓ డ్రైవర్ (డీటీవో పీఏ) వద్ద రూ.46 వేల పైచిలుకు నగదు లభించింది. తాజాగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బీరు తాగుతూ విధులు నిర్వర్తించడం మరోమారు చర్చనీయాంశమైంది. డీటీవో తీరు వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.